క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



గ్యాస్ గోడౌన్ వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పొదలకూరు : అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకు వద్ద అగ్నిప్రమాదాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఓ వరకుమార్ పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది డెమో ద్వారా పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మంటలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఉద్యోగులు, గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకు సిబ్బంది పాల్గొన్నారు.

మితిమీరిన ఆంక్షలతో ప్రజల అవస్థ

నెల్లూరు(క్రైమ్) : నామినేషన్ కేంద్రం వద్ద మితిమీరిన ఆంక్షలు విధించడంతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. నెల్లూరు లోక్‌సభ అభ్యర్థుల నామినేషన్ కేంద్రాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా వీఆర్సీ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రహదారిలోని జెడ్పీ కార్యాలయం వద్ద, కలెక్టరేట్‌కు వెళ్లే మిగిలిన రహదారుల్లో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, గృహాలు ఉన్నాయి. ఈ మార్గంలో వాహనాలను అనుమతించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. దీంతో ప్రజలు ముందస్తు సమాచారం లేకుండా ఇలా చేయడం సరి కాదని విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

కష్టపడి చదివితే లక్ష్యాలను సాధించవచ్చు



సివిల్స్ ర్యాంకర్ వెంకటేష్‌ను సత్కరిస్తున్న డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్): యువత కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని సివిల్స్–2024 ఫలితాల్లో 467వ ర్యాంకు సాధించిన శ్రీకాకుళం జిల్లా అల్లాడిపేటకు చెందిన బాన్న వెంకటేష్ తెలిపారు. నెల్లూరులోని తన బంధువైన, పీహెచ్‌పీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు బైరి శంకరారావు ఇంటికి వచ్చిన వెంకటేష్ ఆ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓను పెంచలయ్యను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ను డీఎంహెచ్ఓ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తాను ఎన్ఐటీలో చదివేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. రెండేళ్ల పాటు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసిన తర్వాత సివిల్స్ శిక్షణ తీసుకుని రెండో ప్రయత్నంలోనే ర్యాంకు సాధించానని తెలిపారు. తనను పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, వీరయ్య, మస్తానయ్య, వెంకటరమణయ్య, బైరి శంకరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం ఖాయం



ప్రజలతో కరచలనం చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కురిచెర్లపాడు, ఇస్లాంపేట గ్రామంలో మంత్రి కాకాణి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, మహిళలు మంత్రి కాకాణికి పూలు, కర్పూర హారతులతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని అన్నికాలనీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రజలను ఆప్యాయంగా పలకరించి, జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు ఎలా అందాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని తెలియజేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి రాష్ట్రంలోనే సర్వేపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. సోమిరెడ్డికి మరోసారి ఓటమి తప్పదని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యలను వినే ఓపికలేని సోమిరెడ్డికి ఓటు అడిగే హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకోవడం, దాచుకోవడం తప్ప నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. నెల్లూరులోని వేదాయపాళెంలో ఉంటూ, టీడీపీలో ఉన్నవారికే కండువాలు కప్పుతూ టీడీపీ పుంజుకుంటుందని సోషల్ మీడియాలో ప్రచారాలు చేసుకోవడం తప్ప, సోమిరెడ్డి ప్రజల్లో ఎక్కడా కనిపించడం లేదన్నారు. సోమిరెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు టీడీపీకి, సోమిరెడ్డికి ఓటు వేసే ప్రసక్తే లేదన్నారు.

శివపార్వతులకు ఏకాంత సేవ



ఏకాంత సేవలో సంగమేశ్వర దంపతులు

మనుబోలు : సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతన దంపతులైన శివపార్వతులకు ఏకాంత సేవను బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు సర్వేపల్లి ఫణీంద్రశర్మ, సాయిశర్మ వేదమంత్రోచ్చారణల మధ్య నూతన దంపతులైన శివపార్వతులకు అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. తొమ్మిది రకాల పండ్లు, తొమ్మిది రకాల స్వీట్లను స్వామి దంపతులకు నైవేద్యంగా ఉంచి శాస్త్రోక్తంగా ఏకాంత సేవ జరిపించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై ఏకాంత సేవను తిలకించి తరించారు. ఉభయకర్తలుగా గూడూరు పెంచలయ్య, జ్యోతి దంపతులు వ్యవహరించారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్, నెల్లూరు నెరజాన చిత్రాల బాల నటుడు మడమనూరు గ్రామానికి చెందిన ఉప్పు వెంకటేష్ ప్రదర్శించిన స్కిట్స్, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్సవ నిర్వాహకులు వెంకటేష్‌ను సన్మానించారు. గ్రామ పెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

హుందా రాజకీయాలు చేయాలి



పార్టీలో చేరిన వారితో డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు

కొడవలూరు : డబ్బు తీసుకొని పార్టీలు మారితే గ్రామస్తులు ఛీకొడతారని, హుందా రాజకీయాలు చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. మండలంలోని తలమంచిలో 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి చలపతిరావు గురువారం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఓ చోటా నాయకుడు మంగళవారం వరకు వైఎస్సార్‌సీపీలో కొనసాగి బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారని తెలిపారు. గత ఎన్నికల సమయంలో టీడీపీలో పనిచేసిన ఆ చోటా నాయకుడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జగనన్న పాలన పట్ల ఆకర్షితుడై వచ్చానని చెప్పడంతో పార్టీలో చేర్చుకున్నట్లు చెప్పారు. ఇక్కడ సొంత పనులు ఎన్నో చేయించుకుని లబ్ధి పొంది డబ్బుకు అమ్ముడుపోయి టీడీపీలో చేరాడని విమర్శించారు. టీడీపీలో చేరే ముందు రోజే ఆ చోటా నాయకుడు నా వద్దకు వచ్చి రూ.25 లక్షలు ఇస్తామని చెప్పడంతో పార్టీ మారుతున్నట్లు చెప్పారని తెలిపారు. డబ్బు కోసం వెళ్లిన వ్యక్తి తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇకనైనా హుందాగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అడపాల మోహనకృష్ణ, సర్పంచ్ వై.భాస్కర్‌రావు, నాయకులు ఎ.వెంకట సతీష్, బైనా నాగరాజ, ఆర్.వేణు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉదయం మండలంలోని పంటపాళెం, మధ్యాహ్నం ఈపూరు, సాయంత్రం దొరువులపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ వర్గాలు గురువారం వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా కోరారు.

వేడుకగా గజ వాహనోత్సవం



కొడవలూరు : మండలంలోని కొత్తవంగల్లు రామాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గజ వాహనోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి గజ వాహనంపై కొలువుదీరిన స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం జరిగింది.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ లహరి

ఇందుకూరుపేట : ప్రతి పౌరుడు ఎన్నికల నియమ నిబంధనలు తప్పక పాటించాలని ఎంపీడీఓ సాయి లహరి సూచించారు. ఇందుకూరుపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీల తరఫున తిరగడం, పనిచేయడం వంటివి ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లేనని వివరించారు. కోడ్ ఉల్లంఘనపై అధికారులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

వలంటీర్ల సామూహిక రాజీనామా



రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

కొడవలూరు : మండలంలోని పెయ్యలపాళెంలో ఆరుగురు వలంటీర్లు గురువారం సామూహిక రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు గురువారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ సౌలభ్యంగా సేవలందించేలా తమను నియమిస్తే చంద్రబాబు తమపై కక్ష గట్టి సేవలు నిలిపివేయించారన్నారు. ఏప్రిల్ మాసపు పింఛన్ కోసం వికలాంగులు, వృద్ధులు ఎంతో అవస్థలు పడ్డారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తుందని, అందువల్లే తాము రాజీనామాలు చేసి జగనన్న విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

అర్హులకే పోస్టల్ బ్యాలెట్



అర్హులకు ఫామ్-12డీ అందజేస్తున్న అధికారులు

మనుబోలు : అర్హులైన వారికే పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తామని సెక్టోరియల్ ఆఫీసర్స్ మేమారెడ్డి, జహీర్ తెలిపారు. మండలంలో పోస్టల్ బ్యాలెట్‌లు అవసరమైన వారిపై విచారణ చేపట్టి అర్హులకు ఫామ్–12డీలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 496 మంది దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు 180 మంది ఉన్నారని తెలిపారు. వీరందరి ఇళ్లకు వెళ్లి పరిశీలించి అవసరమైన వారికి ఫారమ్ 12–డీని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎల్ఓలు నాగార్జునరెడ్డి, నాగేశ్వరరావు, సౌమ్య, శంకర్, మాధవి, శ్రీహరి తదితరలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీకి విశేష స్పందన



మాట్లాడుతున్న పూజారెడ్డి

కోవూరు : నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కోడలు పుజారెడ్డి అన్నారు. కోవూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో తన మామయ్య ప్రసన్నపై ప్రజలు ఎంతో ప్రేమ చూపిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపిస్తాయన్నారు. ఎక్కడకి వెళ్లినా ఎమ్మెల్యే ప్రసన్న హయాంలో ఈ రోడ్డు వేశారని, ఈ కాలువ నిర్మించారని చెబుతుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. బుచ్చిరెడ్డిపాళెం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

మీ అభిమానం మరువలేనిది
– రజత్‌కుమార్‌రెడ్డి

మా కుటుంబంపై ప్రజలు చూపుతున్న అభిమానం ఎప్పటికీ మరువలేనని వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రసన్న నామినేషన్ వేసేందుకు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు.

నేత్రపర్వం.. కల్యాణం



సీతారాముల వివాహం

మనుబోలు : శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండలంలోని కొండూరుసత్రం గ్రామంలో సీతారాముల పట్టాభిషేకాన్ని బుధవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు శ్రీనివాసులు విష్ణుసహస్రనామ పారాయణం, సహస్రనామార్చన, రామనామ హోమం నిర్వహించారు. అనంతరం సీతారాములకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. గ్రామస్తులు సీతారాములకు కొబ్బరికాయలు, పండ్లు పూలతో మంగళ హారతులు పట్టారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



ప్రత్యేకాలంకరణలో సీతారాములు

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీసీతారాముల కల్యాణం బుధవారం రాత్రి కమనీయంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిపించారు. ఉభయకర్తలుగా కె.సురేష్–మంజుల దంపతులు వ్యవహరించారు. కల్యాణానికి హాజరైన మహిళలకు సీతారాముల తలంబ్రాలు అందజేశారు. భక్తులకు అన్నప్రసాదాలను అందించారు. సీతారాముల కల్యాణానికి మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

వ్యక్తిపై దాడి



గాయపడిన సాధిక్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల కాలనీ నెహ్రూ నగర్ వద్ద గురువారం ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు సాధిక్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక మసీదులో సాయంత్రం ప్రార్థనలు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు అడ్డగించారన్నారు. ఎవరికో డబ్బు ఇవ్వాలని మాట్లాడుతూ విచక్షణారహితంగా వారు దాడి చేశారని వాపోయాడు. తాను ఎవరికీ డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదని చెబుతున్నా వినకుండా కాళ్లపై కర్రతో కొడుతూ గాయపరిచారని వివరించారు. ఇటీవల కాలంలో తన కుటుంబంలో గొడవలు జరిగాయని, దాడి వెనుక తన అన్న కుమారుడు ఉన్నాడనే అనుమానం ఉందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సంక్షేమ సారథికే ప్రజా మద్దతు



కొడవలూరు: తలమంచిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న చలపతిరావు



పొదలకూరు : సర్వారెడ్డి కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

కొడవలూరు : ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ సారథికి అండగా నిలుస్తామని ప్రజలు చెబుతున్నారని, వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం కోసం మండలంలోని తలమంచిలో ఆయన ఇంటింటి ప్రచారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తే జిల్లా రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి జిల్లాపై స్పష్టమైన అవగాహన ఉండడంతో పాటు పార్లమెంట్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించగలిగే సత్తా ఉందన్నారు. జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు పెరగాలంటే ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించుకోవాలని చెప్పారు. నియోజకవర్గాన్ని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కోవూరు ఆదర్శ నియోజకవర్గంగా మార్చాలంటే ప్రసన్నను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణ చూస్తుంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావడం తథ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అడపాల మోహనకృష్ణ, సర్పంచ్ వై.భాస్కర్‌రావు, నాయకులు బైనా నాగరాజ, ఆత్మకూరు వెంకటసతీష్, రాయపు వేణు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఇంటింటి ప్రచారం

పొదలకూరు : పట్టణ పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక సర్వారెడ్డి, ఎమ్మార్వో, శింగయ్యచేను కాలనీల్లో పార్టీ నేతలు వేర్వేరుగా గురువారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. కాకాణి స్థానికుడని, పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు తిరిగి ఆయన్నే ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ సోమా అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ, పార్టీ నేతలు ఎం.శేఖర్‌బాబు, ఎం.శివశంకర్, సోమా పెంచలయ్య, మూలి సతీష్‌కుమార్‌రెడ్డి, సోమా భాస్కర్, ఎం.రవికుమార్, ఓబుల్‌రెడ్డి, వేమారెడ్డి, చొప్పా వెంకటేశ్వర్లు, జి.లక్ష్మీకల్యాణి, జి.వేణుగోపాల్‌రెడ్డి, అంకిరెడ్డి, హరి, ఎస్.శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, కండే వాసు, ఖాదర్, వాకాటి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : ఎమ్మార్వో కాలనీలో..



పొదలకూరు : శింగయ్యచేనులో..